సాక్షి మహబూబాబాద్

గురువారం | 22 | మే | 2025



మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి
కేంద్ర ప్రభుత్వం వెంటనే మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని శాంతి చర్చల కమిటీ చైర్మన్ జస్టిస్ చంద్రకుమార్ డిమాండ్ చేశారు. - 8లో▸



'ఎల్‌సీ' నిర్లక్ష్యంపై సీఎండీ అసహనం
ఎల్‌సీ యాప్ వినియోగంలో నిర్లక్ష్యంపై విద్యుత్ ఇంజనీర్లు, ఆపరేటర్లపై టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. - 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 32.6^0 / 22.3^0
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం పలుచోట్ల ఆకాశం మేఘావృతమై అకాల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కంటి పరీక్షలు నిర్వహించాలి
- డీఎంహెచ్‌ఓ రవిరాథోడ్



నెహ్రూసెంటర్: అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలందరికీ ఆర్‌బీఎస్‌కే కార్యక్రమం ద్వారా కంటి పరీక్షలు నిర్వహించాలని డీఎంహెచ్‌ఓ రవిరాథోడ్ సూచించారు. జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో ఆర్‌బీఎస్‌కే కార్యక్రమంపై బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. ఎనిమియా ఉన్న పిల్లలను గుర్తించి వారికి ఐరన్, ఫోలిక్ ఆసిడ్ మాత్రలు ఇవ్వాలని సూచించారు. ఆర్‌బీఎస్‌కే బృందాలు గిరిజన వెల్ఫేర్, కస్తూర్బా, ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు.కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ విజయ్, డిప్యూటీ మాస్ మీడియా అధికారి ప్రసాద్, హెచ్ఈఓ రామకృష్ణ, డాక్టర్ కుమార్, డాక్టర్ శివరాం తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ, ఈబీసీ విద్యార్థుల నుంచి పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అధికారి ఎం.నర్సింహస్వామి బుధవారం తెలిపారు. ఈ నెల 30 వరకు ఆన్‌లైన్‌లో సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

గుట్టుచప్పుడు కాకుండా అబార్షన్‌కు యత్నం
- డీఎంహెచ్‌ఓకు సమాచారం.. అప్పటికే చేజారిన పరిస్థితి
- జీజీహెచ్‌కు తరలించి అబార్షన్



విచారణ చేస్తున్న డీఎంహెచ్‌ఓ రవిరాథోడ్

నెహ్రూసెంటర్: జిల్లాలోని ఓ మండలానికి చెందిన గర్భిణి పక్క జిల్లాలో స్కానింగ్ చేసుకోగా.. ఆడపిల్ల అని తేలినట్లు సమాచారం. కాగా గుట్టుచప్పుడు కాకుండా అబార్షన్ చేయించుకోవాలని నిర్ణయించుకుంది. ఈమేరకు ఆమె జిల్లాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. విషయం తెలుసుకున్న వైద్యారోగ్యశాఖ అధికారులు ఆమెను జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)కి తరలించారు. అప్పటికే ఆమె పరిస్థితి చేజారిపోవడంతో బుధవారం అబార్షన్ జరిగింది. ఈ ఘటనపై డీఎంహెచ్‌ఓ రవిరాథోడ్‌ను వివరణ కోరగా.. తమకు సమాచారం అందిన వెంటనే వెళ్లి సదరు మహిళను ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించామని.. అక్కడ అబార్షన్ జరిగిందని తెలిపారు. అబార్షన్ విషయమై భార్యభర్తలను విచారించి కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. చికిత్స అందించిన ప్రైవేట్ ఆస్పత్రికి నోటీసులు జారీ చేశామని, ఈ విషయంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోనున్నట్లు డీఎంహెచ్‌ఓ వెల్లడించారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి
- ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్



పోలీస్‌స్టేషన్ ప్రారంభోత్సవంలో ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, డీఎస్పీలు

తొర్రూరు: శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు అంకితభావంతో కృషి చేస్తున్నారని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ తెలిపారు. డివిజన్ కేంద్రంలో ఆధునికీకరించిన స్థానిక పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాన్ని బుధవారం ఎస్పీ ప్రారంభించారు. ఉత్తమ సేవలు అందిస్తున్న పోలీసులకు ప్రశంసపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా నేరాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటూ అసాంఘిక శక్తులపై దృష్టి కేంద్రీకరిస్తున్నామని తెలిపారు. పోలీస్ స్టేషన్లను ప్రజల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. పోలీస్‌స్టేషన్లలో వెయిటింగ్ హాల్, ప్రత్యేక కౌంటర్లు, సీసీ కెమెరాలు, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ప్రజలతో సంబంధాలు మెరుగుపర్చేందుకు పోలీసు శాఖ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో తొర్రూరు డీఎస్పీ కృష్ణ కిశోర్, డీఎస్పీలు తిరుపతి, శ్రీనివాస్, మోహన్, సీఐలు టి.గణేష్, రాజు, చంద్రమోహన్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

పుష్కరిణిలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు



సరస్వతి పుష్కరఘాట్‌కు వస్తున్న భక్తులు



పుష్కరిణికి మొక్కుతున్న దంపతులు



నదికి నీళ్లు ఆరబోస్తున్న యువతి



పుష్కరిణీ.. ప్రణామం!

ఏడో రోజు కాళేశ్వరానికి తరలివచ్చిన భక్తజనం
సరస్వతి ఘాట్‌లో స్నానాలు, ముక్తీశ్వరుడి దర్శనం

ఆకాశం అక్షింతలేసినట్లుగా చిరు చినుకులు.. నిశ్శబ్దంగా నది పరుగులు.. కాళేశ్వరం వైపు భక్తుల అడుగులు. వెరసి త్రివేణి సంగమం భక్త జన సందోహమైంది. ఏడో రోజు బుధవారం సైతం భక్తుల ప్రవాహం కొనసాగింది. పుణ్య స్నానాలు ఆచరించిన అనంతరం భక్తులు అంతర్వాహిని సరస్వతి నదికి మొక్కులు చెల్లించుకున్నారు. కాళేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సుమారు లక్షమందికిపైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించినట్లు అధికారులు అంచనా వేశారు.

- మరిన్ని వివరాలు, ఫొటోలు 8లో▸

పోడు భూములకు పుష్కలంగా నీళ్లు



ఇందిర సౌర గిరి జలవికాస పథకం అమలుకు కసరత్తు
- మొదటి విడతలో 1,235 మంది రైతుల ఎంపిక
- బోర్లు, పంపుసెట్, సౌర విద్యుత్ కల్పన
- భూ అనుకూలతను బట్టి పంటల సాగు
- కసరత్తు ప్రారంభించిన జిల్లా అధికారులు

సాక్షి, మహబూబాబాద్: గిరిజనులు పోడు భూముల హక్కులను సద్వినియోగం చేసుకునే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. గిరిజన రైతులు భూములు సాగుచేసి లాభాల పంటలు పండించాలంటే నీటి వనరు కల్పన ప్రధానం. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఇందిర సౌర గిరి జలవికాస పథకం అమలు చేసేందుకు కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ శ్రీకారం చుట్టారు.

మొదటి విడత 1235మంది రైతులకు..

ప్రభుత్వం ఇందిర గిరి జలవికాస పథకాన్ని ఐదు విడతలుగా అమలు చేయనుంది. ఇందులో భాగంగా జిల్లాలో మొదటి విడత 1235 మంది ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు ఉన్న రైతులను ఎంపిక చేయనున్నారు. గతంలో 214 కుటుంబాలకు గిరి వికాసం పథకం పేరుతో సాగునీటి వసతి కల్పించారు. ఆ తర్వాత కొత్తగా గంగారం, కొత్తగూడ, గూడూరు, గార్ల, బయ్యారం, కేసముద్రం, నెల్లికుదురు, మహబూబాబాద్, కురవి మండలాల పరిధిలో 164 గ్రామ పంచాయతీలు, 340 ఆవాస ప్రాంతాలకు చెందిన 24,181 కుటుంబాలకు 67,730 ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇచ్చారు. ఇందులో ప్రస్తుతం నీటి వనరులు ఉన్న భూములు, గిరి వికాసం లబ్ధిదారులు పోను మిగిలిన వారిని ఐదు భాగాలుగా విభజిస్తారు. ఈ వానాకాలం సీజన్ వరకు మొదటి విడతగా లబ్ధిదారులను ఎంపిక చేసి వారి భూములకు సాగునీరు అందించనున్నారు.

కమిటీల ద్వారా ఎంపిక..

లబ్ధిదారుల ఎంపిక కోసం మండల కమిటీలు ఏర్పాటు చేస్తారు. ఇందులో మండల అభివృద్ధి అధికారి, భూగర్భజల అధికారి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి, గిరిజనాభివృద్ధిశాఖ అధికారి ఉంటారు. ప్రత్యేకంగా రూపొందించిన ఫార్మెట్ ప్రకారం గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. ఈ దరఖాస్తులను పరిశీలించి భూమిలో బోరు పడే ప్రాంతాలను గుర్తిస్తారు. విద్యుత్ సరఫరా కోసం యూనిట్‌కు రూ. 6లక్షల చొప్పున వంద శాతం సబ్సిడీతో సోలార్ ఉత్పత్తి పరికరాలను అమర్చుతారు. బోరుబావిలో మోటారు బిగిస్తారు. ఈ ప్రక్రియ జరిగిన తర్వాత భూముల స్వభాన్ని భట్టి జామ, బాంబో, ఆయిల్‌పామ్ తదితర తోటల పెంపకానికి ప్రోత్సాహకాలు అందిస్తారు. వంద శాతం సబ్సిడీతో డ్రిప్, ఇతర పరికరాలు అందజేస్తారు.

సౌర విద్యుత్‌తో అదనపు ఆదాయం

ఇందిర సౌర గిరి జల వికాస పథకం ద్వారా గిరిజనుల భూముల్లో ఏర్పాటు చేసే సౌర విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ ద్వారా కరెంట్ సరఫరా జరుగుతుంది. ఈ విద్యుత్‌తో పంపుసెట్లు నడిపించుకోగా మిగులు విద్యుత్‌ను.. ఉత్పత్తి సంస్థకు అమ్మే అవకాశం ఉంటుంది. ఇలా మిగులు విద్యుత్ ద్వారా గిరిజన రైతులకు నెలకు రూ. 5వేల మేరకు అదనపు ఆదాయం వస్తుందని అధికారులు చెబుతున్నారు.

కసరత్తు ప్రారంభించాం



ఇందిర సౌర గిరి జల వికాస పథకం అమలుకోసం కసరత్తు ప్రారంభించాం. జిల్లా కలెక్టర్ నేతృత్వంలో గిరిజన ప్రాంతాల్లోని మండల అధికారులతో సమీక్షలు నిర్వహించాం. మండల కమిటీల ద్వారా లబ్ధిదారుల నుంచి దరఖాస్తుల స్వీకరణ చేపట్టనున్నాం. ప్రక్రియ వేగవంతంగా చేపట్టి గిరిజన భూములను సస్యశ్యామలం చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం.

\- దేశిరాం నాయక్, జిల్లా గిరిజన అభివృద్ధిశాఖ అధికారి

విత్తన చట్ట నియమాలు పాటించాలి
- కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మహబూబాబాద్ అర్బన్: వ్యాపారులు విత్తన చట్ట నియమ, నిబంధనలు పాటించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో డీఏఓ విజయనిర్మల ఆధ్వర్యంలో విత్తన వ్యాపారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కలెక్టర్ హాజరై మాట్లాడుతూ.. పోలీస్, వ్యవసాయ, రెవెన్యూ శాఖలతో కూడిన విత్తన టాస్క్‌ఫోర్స్ బృందాల ఏర్పాటుకు ప్రతిపాదించామన్నారు. చట్టాన్ని ఉల్లంఘించడం ఏ మాత్రం సమర్థనీయం కాదని, అందుకే సీజన్ ప్రారంభానికి ముందు ఈ అవగాహన సదస్సు ఏర్పాటు చేశామన్నారు. విత్తన వ్యాపారులు అన్ని నియమాలు కచ్చితంగా పాటించాలని, నిల్వ, విక్రయ కేంద్రాల్లో రెగ్యులర్ తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వం నకిలీ విత్తనాల విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని సూచించారు. సమావేశంలో ఏఓ టెక్నికల్ జి.విజ్ఞాన్, డీఎస్పీ తిరుపతిరావు, జిల్లా హార్టికల్చర్ అధికారి మరియన్న, డీసీఓ వెంకటేశ్వర్లు, డీఎం మార్క్‌ఫెడ్ శ్యామ్, ఏడీఏలు విజయ్ చంద్ర, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో నేటినుంచి జరగనున్న ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు చేశామని డీఐఈఓ మదార్ గౌడ్ బుధవారం తెలిపారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు జరుగుతాయని చెప్పారు. ఫస్టియర్ పరీక్షలు ఉదయం 9నుంచి 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2:30నుంచి సాయంత్రం 5:30వరకు జరుగుతాయన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందే హాజరుకావాలని, నిమిషం ఆలస్యమైతే అనుమతించమన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, వైద్యసేవలు అందుబాటులో ఉంటాయన్నారు. చీఫ్ సూపరింటెండెంట్‌లు, అసిస్టెంట్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు సమన్వయంతో పని చేసి పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని, పోలీస్‌స్టేషన్ నుంచి ప్రశ్నపత్రాల బండిలను పోలీసు బందోబస్తు మధ్య తీసుకెళ్లి సీసీ కెమెరాల ముందు మాత్రమే విడుదల చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా మొదటి సంవత్సరం విద్యార్థులు 2,500మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 1,500 మంది పరీక్షలకు హాజరవుతారన్నారు.

పరీక్షలకు పోలీసు బందోబస్తు: ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష కేంద్రాల వద్ద విస్తృత పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ సుధీర్ రాంనాథ కేకన్ బుధవారం తెలిపారు. ఈ నెల 22నుంచి 29 వరకు సప్లిమెంటరీ పరీక్షల సందర్భంగా అయా పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 8నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు సెక్షన్ 163 అమలులో ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులు గుంపులుగా ఉండొద్దని సూచించారు. అదే విధంగా ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు, మైకులు, డీజేలతో ఊరేగింపులు, ధర్నాలు, ప్రచారాలు నిర్వహించొద్దని పేర్కొన్నారు. పరీక్షల సమయంలో కేంద్రాల పరిసరాల్లోని ఇంటర్నెట్ సెంటర్లు, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలని సూచించారు.

పెద్దవంగర: బొమ్మకల్లులో తడిసిన ధాన్యం



అకాల వర్షానికి తడిసిన ధాన్యం

జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం కురిసిన అకాల వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిముద్దయింది. కొత్తగూడ మండలం మైలారం కొనుగోలు కేంద్రంలో వరదకు ధాన్యం కొట్టుకుపోయింది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ధాన్యం త్వరగా కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని వేడుకుంటున్నారు.

\- మహబూబాబాద్ రూరల్/కురవి/కొత్తగూడ/దోర్నకల్/కేసముద్రం/మరిపెడ రూరల్/పెద్దవంగర/దంతాలపల్లి



మహబూబాబాద్ రూరల్: జంగిలిగొండ కొనుగోలు కేంద్రంలో అడుగులు తడిసిన ధాన్యం బస్తాలు



కొత్తగూడ: మైలారం కేంద్రంలో వరదకు కొట్టుకుపోయిన ధాన్యం



కురవిలో ధాన్యం రాశుల కింద వర్షపు నీరు

కమ్ముకున్న కారుమబ్బులు

మహబూబాబాద్ పట్టణాన్ని బుధవారం మధ్యాహ్నం కారుమబ్బులు కమ్మేశాయి. నల్లని మేఘాలు భవనాలను తాకుతున్నట్లు కనిపిపిస్తున్న ఈ దృశ్యం 'సాక్షి' కెమెరాకు చిక్కింది.

\- సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, మహబూబాబాద్



వేతనాలు పెండింగ్

ఐదు నెలలుగా మున్సిపల్ కార్మికులకు అందని జీతాలు
- అధికారులు చొరవ చూపడంలేదని ఆవేదన
- సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళనలు

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీలో అవుట్ సోర్సింగ్‌లో పని చేస్తున్న ఉద్యోగులకు ఐదు నెలలుగా వేతనాలు అందడం లేదు. ప్రధానంగా పారిశుద్ధ్య కార్మికుల పరిస్థితి మరి దారుణంగా తయారైంది. ఖాతాలో డబ్బులు ఉన్నా.. వాటి విడుదల విషయంలో అధికారులు శ్రద్ధచూపడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోతున్నారు. ఈమేరకు యూనియన్ల ఆధ్వర్యంలో కార్మికులు ఆందోళన బాట పట్టారు.

అవుట్ సోర్సింగ్‌లో 205మంది..

మానుకోట మున్సిపాలిటీ పరిధిలో 36 వార్డులు ఉండగా 68,889 మంది జనాభా, 57,828 మంది ఓటర్లు ఉన్నారు. 25,000పైగా గృహాలు ఉన్నాయి. అవుట్ సోర్సింగ్‌లో 205 మంది పని చేస్తున్నారు. దీనిలో పారిశుద్ధ్య కార్మికులకు 143 మంది ఉన్నారు. కారోబార్లు, వాటర్ సప్లై, కంప్యూటర్ ఆపరేటర్లు, ఎన్ఎంఆర్‌లు, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగంలో పని చేసే వారితో మొత్తం 205 మంది ఉన్నారు.

ఐదు నెలల వేతనాలు పెండింగ్‌లోనే..

ఎన్ఎంఆర్‌లు (ఆరుగురు) వారికి మాత్రమే మూడు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉండగా.. మిగిలిన వారందరికీ ఐదు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. వారికి నెలకు రూ.16,600 వేతనం ఇస్తున్నారు. కాగా, వేతనాలు చేసి సంబంధిత ఖాతాలో జమ చేసినట్లు అధికారులు తెలిపారు. కాగా జీతాలు ఆర్‌బీఐలోనే పెండింగ్‌లో ఉన్నాయని చెబుతున్నారు. సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదు.

ఏప్రిల్ నెల బిల్లుల్లో మాత్రమే జాప్యం..

ఏప్రిల్ నెల బిల్లులు చేయలేదు. గత నెల 30న కమిషనర్‌గా పని చేసిన నోముల రవీందర్ ఉద్యోగ విరమణ పొందారు. అదే రోజు వరంగల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్‌గా పని చేస్తున్న టి.రాజేశ్వర్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. తన చెక్ పవర్ విషయంలో బిల్లులు చేయడం ఆలస్యమైందని అధికారులు చెబుతున్నారు.



మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికసంఘాల నాయకులు(ఫైల్)

డబ్బుల కొరత లేదు..

ఇటీవల మానుకోట మున్సిపాలిటీకి స్టాంప్ డ్యూటీ డబ్బుల కింద రూ.10.53 కోట్లు వచ్చాయి. వాటిని కేవలం వేతనాల కోసమే ఖర్చు చేయాల్సి ఉంది. వాటితో పాటు జనరల్ ఫండ్ కూడా ఉందని అధికారులు పేర్కొన్నారు. డబ్బు సమస్య లేకున్నా ఆర్‌బీఐ సమస్యతోనే ఆలస్యమవుతోంది.

ఆందోళన బాట..

అవుట్‌సోర్సింగ్‌లో పనిచేసేవారిలో ఎక్కువ మంది పారిశుద్ధ్య కార్మికులే ఉన్నారు. వేతనాలు రాకపోవడంతో సీఐటీయూ అనుబంధ తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈనెల 26 వరకు పెండింగ్ వేతనాలు విడుదల చేయకపోతే ఈ నెల 27నుంచి పనులు నిలిపివేస్తామని నాయకులు హెచ్చరించారు. ఏఐటీయూసీ అనుబంధ యూనియన్ ఆధ్వర్యంలో కూడా మున్సిపల్ కార్యాలయంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందజేశారు.

సమ్మె చేపడతాం



ప్రభుత్వం స్పందించి వెంటనే వేతనాలు విడుదల చేయాలి. లేకుంటే సమ్మె చేపడుతాం. ఐదు నెలలుగా వేతనాలు లేక అప్పుల పాలవుతున్నాం. కుటుంబ పోషణ కష్టంగా మారింది. కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలి. వేతనాల సమస్య పరిష్కరించాలి.

\- కాంపెల్లి శ్రీనివాస్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి (సీఐటీయూ)

త్వరలోనే విడుదలవుతాయి..



ఉద్యోగులు, కార్మికుల వేతనాలు ప్రతీ నెల రూ. 45లక్షలు సంబంధిత ఖాతాలో జమ చేస్తున్నాం. బిల్లులు పెండింగ్‌లో లేవు. సీడీఏఎంకు కూడా వివరించాం. త్వరలోనే విడుదల అవుతాయని ఉన్నతాధికారులు తెలిపారు.

\- శ్రీదేవి, అకౌంటెంట్

బోధనా నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి

మహబూబాబాద్ అర్బన్: ఉపాధ్యాయులు తమ బోధనా నైపుణ్యాలు మెరుగుపర్చుకోవడానికి శిక్షణ తరగతులు ఉపయోగపడతాయని అదనపు కలెక్టర్ వీర బ్రహ్మచారి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతున్న శిక్షణ తరగతులను బుధవారం ఆయన సందర్శించి మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాల ఆధారంగా మరింత మెరుగ్గా విద్యార్థులకు బోధించాలన్నారు. అలాగే వ్యాయామ విద్య ఉపాధ్యాయ శిక్షణను రాష్ట్ర పరిశీలకుడు తోటకూరి వెంకటేశ్వర్లు సందర్శించి మాట్లాడారు. భవిష్యత్‌లో దేశం ఒలింపిక్‌లో మెడల్స్ సాధించడానికి వ్యాయామ ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.

నదితీరం.. జనహోరం



ప్రమిదలు వదులుతున్న మహిళలు






తమ చిన్నారులకు పుష్కర స్నానం చేయిస్తున్న కుటుంబ సభ్యులు



శునకాలకు పుష్కరస్నానం చేయిస్తున్న యువతులు



దేవుళ్ల చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న మహిళలు



నదిలో భక్తురాలి పూనకం





నదిలో సెల్ఫీ దిగుతున్న మహిళలు, చిన్నారులు



పుష్కర స్నానం ఆచరిస్తున్న భక్తజనం



పార్కింగ్ స్థలాల్లో నిలిపిన వాహనాలు (విహంగ వీక్షణం)



బురదలో దిగబడిన వ్యాన్‌ను తాడుతో బయటకు లాగుతున్న జేసీబీ



మొక్కుతున్న గిరిజన మహిళ



పుష్కర ఘాట్‌లో ఏర్పాటు చేసిన శివుడి ప్రతిమ వద్ద భక్తులు



ఆటోలు, కార్లు, ఇతర వాహనాల్లో పుష్కరాలకు తరలివస్తున్న భక్తులు



నవరత్నమాలిక హారతి ఇస్తున్న పండితులు

భూమి రిజిస్ట్రేషన్ చేయడం లేదని దంపతుల ఆత్మహత్యాయత్నం

తరిగొప్పుల: తాము కొనుగోలు చేసిన భూమిని అమ్మకందారుడు రిజిస్ట్రేషన్ చేయకుండా కాలయాపన చేస్తూ తీవ్ర ఇబ్బందులు గురిచేస్తున్నారని దంపతులు శరీరంపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన బుధవారం మండల కేంద్రం శివారు ఎన్యానాయక్‌తండాలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. జనగామ జిల్లా చిల్పూరు మండలం శ్రీపతిపల్లికి చెందిన జంగ రవి తరిగొప్పుల మండలం ఎన్యానాయక్‌తండాకు చెందిన ముడావత్ సంపత్‌నాయక్ వద్ద 2 సంవత్సరాల క్రితం 2 గుంటల భూమిని గుంటకు రూ.3.30 లక్షల చొప్పున కొనుగోలు చేశాడు. అయితే ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేయకుండా సంపత్‌నాయక్ కాలయాపన చేస్తూ వస్తున్నాడు. దీంతో రవి పెద్దమనుషులను ఆశ్రయించగా 2 గుంటలకు బదులు మరోచోట 8 గుంటల భూమి ఇవ్వాలని రెండు రోజుల క్రితం తీర్మానం చేశారు. సంపత్‌నాయక్ మరోచోట 8 గుంటల భూమికి హద్దులు చూపించగా ఆ భూమిని రవి మంగళవారం ట్రాక్టర్‌తో దున్నాడు. ఈ క్రమంలో ఏమైందో తెలియదు కానీ బుధవారం ఉదయం రవి తన భార్య, బిడ్డతో సంపత్‌నాయక్ ఇంటికి వచ్చి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వెంటనే గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఆ దంపతులను వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

'ఎల్‌సీ' నిర్లక్ష్యంపై సీఎండీ అసహనం



వీసీలో మాట్లాడుతున్న టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

- డ్యాష్ బోర్డులో వివరాల నమోదులో అలసత్వంపై సీరియస్

హన్మకొండ : ఎల్‌సీ యాప్ వినియోగంలో నిర్లక్ష్యంపై విద్యుత్ ఇంజనీర్లు, ఆపరేటర్లపై టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. బుధవారం హనుమకొండలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి 16 సర్కిళ్ల ఎస్ఈలు, డీఈలు, ఏడీఈ, ఏఈలతో వీడియో కాన్ఫరెన్స్ (వీసీ) నిర్వహించారు. ఎల్‌సీ యాప్ నిర్వహణ, డ్యాష్‌బోర్డులో పారామీటర్ల నమోదు, విద్యుత్ అంతరాయాలపై సమీక్షించారు. విద్యుత్ ప్రమాదాలు తగ్గించేందుకు, భద్రతకు అత్యంత ప్రాధాన్యత కల్పించేందుకు ప్రవేశ పెట్టిన ఎల్‌సీ యాప్‌పై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అదే విధంగా డ్యాష్ బోర్డులో ఎవరు ఏ పని చేస్తున్నారో నమోదు చేయకపోవడంపై సీరియస్ అయ్యారు. ఇక నుంచి అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్ టి.మధుసూదన్, చీఫ్ ఇంజనీర్లు రాజు చౌహాన్, అశోక్, జీఎం శ్రీనివాస్, ఎస్ఈలు, డీఈ, ఏడీఈ, ఏఈలు పాల్గొన్నారు.

మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

- శాంతి చర్చల కమిటీ చైర్మన్ జస్టిస్ చంద్ర కుమార్



మాట్లాడుతున్న జస్టిస్ చంద్ర కుమార్

హన్మకొండ: కేంద్ర ప్రభుత్వం తాత్సారం వీడి వెంటనే మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని శాంతి చర్చల కమిటీ చైర్మన్ జస్టిస్ చంద్ర కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని హోటల్ హరిత కాకతీయలో శాంతి చర్చల కమిటీ ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో జైసింగ్ రాథోడ్ అధ్యక్షతన ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జస్టిస్ చంద్ర కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మధ్య భారతదేశంలో పోలీసులు, మావోయిస్టుల మధ్య జరుగుతున్న అంతర్ యుద్ధంలో సామాన్య ప్రజలు, అమాయక ఆదివాసీలు చనిపోతున్నారన్నారు. రాజ్యం తరపున పోలీసులు సైతం మరణించి మధ్య భారతమంతా నెత్తురోడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మారణహోమాన్ని గమనించిన శాంతి చర్చల కమిటీ చేసిన అభ్యర్థన మేరకు మావోయిస్టు పార్టీ కాల్పులు విరమణ చేసి శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించిందన్నారు. కేంద్రం స్పందించకుండా దాడులను మరింత పెంచి సామాన్యులను సైతం చంపేస్తోందని, కాల్పుల విరమణ స్థితిలో ఉన్నవాళ్లను చుట్టుముట్టి చంపడం దుర్మార్గమని విమర్శించారు. ఇప్పటికైనా మావోయిస్టులతో శాంతి చర్చలు జరపడానికి ప్రధాని మోదీ, హోం మంత్రి వెంటనే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం శాంతి చర్చల కమిటీ రాష్ట్ర సభ్యుడు సోమ రామ్మూర్తి, ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్, ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, సిద్ధబోయిన లక్ష్మీనారాయణ, చుంచు రాజేందర్, అనిక్ సిద్ధికి, చిల్ల రాజేంద్రప్రసాద్, బొట్ల భిక్షపతి, ప్రొఫెసర్ అన్వర్ ఖాన్ మాట్లాడారు. కార్యక్రమంలో న్యాయవాదులు అబ్దుల్ నబీ, పండుగ శ్రీనివాస్, ఆదినారాయణ, దొమ్మటి ప్రవీణ్ కుమార్, కొండ్ర నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇస్రో నోడల్ సెంటర్ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాల కోఆర్డినేటర్లుగా జితేందర్, సరిత



జితేందర్



సరిత

కేయూ క్యాంపస్: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) అనుబంధ సంస్థ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ (ఇస్రో -ఐఆర్ఎస్) డెహ్రాడూన్ వరంగల్ ప్రాంతీయ కోఆర్డినేటర్లుగా హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఫిజిక్స్ విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ జితేందర్, డాక్టర్ అలేటి సరిత నియమితులయ్యా రు. ఈ మేరకు ఇస్రో నుంచి సమాచారం అందిందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. జ్యోతి బుధవారం తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ తర్వాత హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ఇస్రో ఈ కోర్సెస్‌కు సంబంధించి నోడల్ సెంటర్‌గా ఉందన్నారు. విద్యార్థులు ఈ కోర్సెస్ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. కాగా, డాక్టర్ జితేందర్, డాక్టర్ సరితను ప్రిన్సిపాల్ జ్యోతి అభినందించారు.

పుష్కర స్నానం.. పులకించిన భక్తజనం

- సరస్వతీనది పుష్కర స్నానాలకు భక్తుల రద్దీ
- వివిధ రాష్ట్రాల నుంచి భారీగా రాక
- ఎమ్మెల్యేలు వినోద్, అనిరుధ్‌రెడ్డి, సీపీ అంబర్‌కిశోర్‌ఝా, ఎస్పీ శ్రీనివాసరావు పుణ్యస్నానాలు
- ఏడో రోజు లక్షకుపైగా తరలొచ్చిన జనం
- వర్షంతో చల్లబడిన వాతావరణం



కాళేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేసిన కలెక్టర్ రాహుల్‌శర్మ దంపతులు

భూపాలపల్లి/కాళేశ్వరం: కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతీనది పుష్కరాలకు భక్తులు రోజురోజుకూ భారీగా తరలివస్తున్నారు. బుధవారం ఏడోరోజు తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి కాళేశ్వరానికి తరలివచ్చారు. గోదావరి, ప్రాణహిత, అంతర్వాహిని సరస్వతీనదిలో పుష్కర పుణ్యస్నానాలు ఆచరించి, నదీమాతకు పూజలు చేశారు. పిండప్రదాన పూజలు చేశారు. నదీమాతకు చీర, సారె సమర్పించారు. ముత్తయిదువలు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. నదిలో దీపాలు వదిలి మొక్కులు చెల్లించారు. ఇసుకలో సైకత లింగాలు చేసి పూజించారు. కాళేశ్వరాలయంలో కాళేశ్వరముక్తీశ్వరుడిని దర్శించుకున్నారు.

ఏడోరోజు లక్షకుపైగా...

హైదరాబాద్, వరంగల్, భూపాలపల్లి రహదారి మీదుగా, పెద్దపల్లి, మంథని, కాటారం మీదుగా వాహనాలు తరలివచ్చాయి. సిరొంచ అంతర్రాష్ట్ర వంతెన గుండా మంచిర్యాల, గోదావరిఖని, చెన్నూర్, ఆసిఫాబాద్, నిర్మల్ నుంచి భక్తులు తరలివచ్చారు. ట్రాఫిక్ జామ్ కాకుండా పోలీసులు డివైడర్లు ఏర్పాటు చేసి నియంత్రించారు. ఆరో రోజు తగ్గిన భక్తులు.. ఏడో రోజు రెట్టింపు సంఖ్యలో తరలివచ్చారు. ఆర్టీసీ, ప్రైవేట్ వాహనాల్లో త్రివేణి సంగమం సరస్వతీనదికి వచ్చి పుష్కర స్నానాలు ఆచరించారు. శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయంలో దర్శనానికి క్యూలైన్‌లో బారులుదీరారు.

ప్రముఖుల పూజలు..

సరస్వతీనది పుష్కరాల్లో ప్రముఖులు స్నానం ఆచరించారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, రామగుండం సీపీ అంబర్‌కిశోర్‌ఝా, ఆసిఫాబాద్ ఎస్పీ శ్రీనివాసరావు పుష్కర స్నానం చేసి కాళేశ్వరముక్తీశ్వరుడిని దర్శించుకున్నారు. అలాగే, భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ దంపతులు కుటుంబ సమేతంగా సరస్వతి ఘాట్ పుష్కరిణిలో పుణ్యస్నానాలు చేశారు. అనంతరం శ్రీకాళేశ్వరముక్తీశ్వరుడిని దర్శించుకున్నారు.

వర్షంతో ఇబ్బందులు..

రెండు రోజులుగా ఉక్కపోత, ఎండ తీవ్రతతో తల్లడిల్లిన భక్తులకు బుధవారం సాయంత్రం గంట పాటు కురిసిన వర్షం ఉపశమనం కలిగించింది. వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో ఆనందం వ్యక్తం చేశారు. మరో వైపు పుష్కరఘాట్‌లో పార్కింగ్ స్థలాలు బురదమయంగా మారాయి. గాలి దుమారానికి బస్టాండ్ సమీపంలో హైదరాబాద్ అల్వాల్‌కు చెందిన ఉజ్వల్‌పై రేకు లేచి పడడంతో తీవ్రగాయమైంది. రక్తస్రావం కాగా వెంటనే అంబులెన్స్ ద్వారా మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యసేవలందించారు.

విద్యుత్ షాక్‌తో వృద్ధురాలి మృతి

- ఇల్లు శుభ్రం చేస్తుండగా ఘటన
- 13 రోజుల్లో మనుమరాలి పెళ్లి.. అంతలోనే విషాదం




నర్సమ్మ (ఫైల్)


హసన్‌పర్తి: మనుమరాలి పెళ్లికి ఇల్లు శుభ్రం చేస్తున్న క్రమంలో విద్యుత్‌షాక్‌కు గురై ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన హసన్‌పర్తి మండలం జయగిరిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. జయగిరికి చెందిన లింగాల నర్సమ్మ(60)కు ఇద్దరు కుమారులు మధు, చంద్రశేఖర్ సంతానం. మధు ఆర్టీసీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ.. ఎనిమిదేళ్ల క్రితం మృతిచెందాడు. మధుకు భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ప్రవీణ్ ఉన్నారు. మధు మృతి తర్వాత అతడి కుటుంబం బతుకుదెరువు నిమిత్తం రాంపూర్ వెళ్లింది. వచ్చే నెల 4న మధు చిన్న కూతురు పెళ్లి జరుగనుంది. జయగిరిలోనే పెళ్లి చేయాలని నిర్ణయించారు. ఈమేరకు ఇంటిని ముస్తాబు చేయడానికి ప్రవీణ్ జయగిరి వచ్చాడు. బుధవారం నానమ్మ నర్సమ్మతో కలిసి ప్రవీణ్ ఇల్లు శుభ్రం చేస్తున్నారు. ఈ క్రమంలో దండెంపై దుస్తులు ఆరేస్తున్న క్రమంలో నర్సమ్మ విద్యుత్ షాక్‌కు గురైంది. గమనించిన ప్రవీణ్ ఆమెను రక్షించడానికి యత్నించి ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటనలో నర్సమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు.

పిడుగుపాటుకు ఇద్దరి మృతి

- మహబూబాబాద్ జిల్లాలో ఘటన




చేరాలు (ఫైల్)



ప్రవీణ్‌కుమార్ మృతదేహం

కొత్తగూడ/గూడూరు: పిడుగుపాటుకు మహబూబాబాద్ జిల్లాలో ఇద్దరు మృతి చెందారు. ఇందులో ఓ గొర్రెల కాపరి, ఓ యువకుడు ఉన్నారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. కొత్తగూడ మండలం ఓటాయికి చెందిన ఏశబోయిన చేరాలు(50) గొర్రెల కాపరిగా పని చేస్తున్నాడు. రోజువారీగా గొర్రెలను మేపేందుకు బుధవారం కూడా గ్రామ సమీపంలోని పొలాల్లోకి వెళ్లాడు. మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుండగా గొర్రెలను తోలుకుని ఇంటికి వెళ్తున్న క్రమంలో పిడుగుపడింది. దీంతో చేరాలు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఘటనలో గూడూరు మండలం గుండెంగ గ్రామానికి చెందిన మైదం సారయ్య కుమారుడు ప్రవీణ్‌కుమార్ (30) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబానికి ఆసరా అవుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం బహిర్భూమికి వెళ్లిన ప్రవీణ్.. వర్షం వస్తుండడంతో రోడ్డు పక్కన చెట్టు కింద నిలబడ్డాడు. అదే సమయంలో చెట్టుపై పిడుగుపడడంతో ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి సారయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు.

పీజీ సెమిస్టర్ల ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ చంద్రమౌళి, పరీక్షల విభాగం అధికారులు

విద్యారణ్యపురి: హనుమకొండలోని పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాల (అటానమస్)లో ఈఏడాది ఏప్రిల్‌లో నిర్వహించిన పీజీ కోర్సుల మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను బుధవారం ఆ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి విడుదల చేశారు. పీజీ కోర్సుల్లో మొదటి సెమిస్టర్ల పరీక్షల్లో మొత్తం 85 శాతం, మూడో సెమిస్టర్ పరీక్షల్లో 93శాతం మంది విద్యార్థినులు ఉత్తీర్ణులయ్యారని చంద్రమౌళి తెలిపారు. విద్యార్థినులు తమ ఫలితాలను సంబంధిత కాలేజీ వెబ్‌సైట్‌లోగాని లేదా కళాశాలలోని పరీక్షల విభాగంలో తెలుసుకోవచ్చని తెలిపారు. ఈ ఫలితాల విడుదల కార్యక్రమంలో పరీక్షల నియంత్రణాధికారి సుహాసిని, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు కె. శ్రీనివాస్, పి. రాజిరెడ్డి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ సురేశ్ బాబు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

సరస్వతి పుష్కరాలకు వన్ వే

నేటి నుంచి పుష్కరాలు ముగిసే వరకు అమల్లోకి..

భూపాలపల్లి: సరస్వతీనది పుష్కరాలకు వాహనాల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో నేటి (గురువారం) నుంచి కాళేశ్వరం రూట్‌ను వన్‌వేగా మారుస్తున్నట్లు ఎస్పీ కిరణ్ ఖరే బుధవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం నుంచి పుష్కరాలు ముగిసే వరకు వన్ వే అమల్లో ఉంటుందన్నారు. హైదరాబాద్, వరంగల్, ఆపై ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు భూపాలపల్లి, కాటారం, మహదేవపూర్, అన్నారం స్తూపం మీదుగా చంద్రుపల్లి, మద్దులపల్లి మీదుగా కాళేశ్వరం చేరుకోవాలని, తిరుగు ప్రయాణంలో కాళేశ్వరం నుంచి మహదేవపూర్ మీదుగా తమ గమ్య స్థానాలకు వెళ్లాలని తెలిపారు. అలాగే, కరీంనగర్ నుంచి వచ్చే వాహనాలు మంథని, కాటారం, మహదేవపూర్, అన్నారం స్తూపం మీదుగా చంద్రుపల్లి, మద్దులపల్లి మీదుగా కాళేశ్వరం చేరుకోవాలని, తిరుగు ప్రయాణంలో కాళేశ్వరం నుంచి మహదేవపూర్ మీదుగా తమ గమ్య స్థానాలకు వెళ్లాలని సూచించారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్ నుంచి వచ్చే వాహనాలు సిరొంచ, అంతర్రాష్ట్ర బ్రిడ్జి మీదుగా కాళేశ్వరం చేరుకుని, తిరుగు ప్రయాణంలో కూడా అదే రూట్లో వెళ్లాలని ఎస్పీ కిరణ్ ఖరే సూచించారు.